


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :100 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 02-08-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## హైడ్రా కృషికి మళ్లీ జీవం..హైదరాబాద్‌కు మరో జలవనం..

హైదరాబాద్,ఒకప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు నీటితో కళ తప్పిన ఉప్పల్ నల్లచెరువు ఇప్పుడు వర్షపు నీటితో కళకళలాడుతోంది. హైడ్రా చేపట్టిన సమగ్ర పునరుద్ధరణ పనుల ఫలితంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు వరద నీటితో నిండిపోయి మళ్లీ జీవం పోసుకుంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణలో భాగంగా వరద నీరు చెరువులోకి చేరేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అదే సమయంలో మురుగు నీరు చెరువులోకి రాకుండా ప్రత్యేక బైపాస్ కాలువను నిర్మించింది. దీంతో భారీ వర్షాల సమయంలో వరద నీరు సురక్షితంగా చెరువులోకి చేరుతుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటి నిల్వ, ముంపు సమస్యలు గణనీయంగా తగ్గాయి.

ఆక్రమణల తొలగింపుతో విస్తరించిన చెరువు

పునరుద్ధరణలో భాగంగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి, చెరువు విస్తీర్ణాన్ని దాదాపు 70 ఎకరాలకు పునరుద్ధరించారు. సుమారు రూ.20 కోట్ల వ్యయంతో హైడ్రా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది.

ఇన్‌లెట్లు, ఔట్‌లెట్‌కు ఆధునిక రూపం

చెరువు జలవ్యవస్థను బలోపేతం చేసేందుకు నాచారం చెరువు, పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు చేరేలా రెండు ఇన్‌లెట్లను నిర్మించారు. అలాగే చెరువు పూర్తిగా నిండిన తర్వాత అదనపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా ఆధునిక ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేశారు.

వినోద కేంద్రంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా

జల సంరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో



వాకింగ్ ట్రాక్, బలమైన ప్రధాన కట్ట, చిన్నారుల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పచ్చదనంతో కూడిన వినోద ప్రదేశాలను అభివృద్ధి చేస్తున్నారు. కుటుంబాలతో వచ్చి విశ్రాంతి తీసుకునే నగరంలోని ప్రధాన వినోద కేంద్రంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన హైడ్రా, ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలో హైదరాబాద్‌కు మరో కీలక జలవనరుగా, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.

## విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి...



హైదరాబాద్, తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 8 వరకు దాదాపు 20 రోజులపాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో పాటు మరికొన్ని కీలక దేశాల్లో ఆయన పర్యటించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. కంపెనీల ప్రతినిధుల అపాయింట్‌మెంట్లను బట్టి తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ), డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, రక్షణ తయారీ వంటి వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులను తెలంగాణకు రప్పించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. అమెరికా పర్యటనలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు జరిగే అవకాశం ఉంది. అలాగే లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యాసంస్థల ప్రతినిధులతో చర్చలు నిర్వహించే అవకాశముందని సమాచారం. గత విదేశీ పర్యటనల్లో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూలు) అమలు పురోగతిని కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించే అవకాశముంది. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన లేదా ఆసక్తి చూపుతున్న అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ కానున్నట్లు తెలుస్తోంది.

సెప్టెంబరు మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు

మరోవైపు, వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారం రోజులపాటు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చట్టసభల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ అంశంపై ఆగస్టు మధ్యలో ప్రత్యేక సమావేశం నిర్వహించే అవకాశాలపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. విదేశీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్రానికి చేరుకోనున్న నేపథ్యంలో, అనంతరం అసెంబ్లీ సమావేశాలను నిర్వహించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మంత్రి విస్తరణ లేనట్టే...



హైదరాబాద్, ఆగస్టు 1, హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్-జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో.. తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది.

### శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం

కరీంనగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 40,380 క్యూసెక్కుల వరద చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 1071.20 అడుగులు. నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలు.. ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 25.353టీఎంసీలు.

## సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..?



హైదరాబాద్, తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం – ప్రజాస్వామ్యం – పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..? ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.


## కార్పొరేట్ పాలనకు కంపెనీ సెక్రటరీలే కీలకం

హైదరాబాద్, కార్పొరేట్ పాలనను బలోపేతం చేయడంలో, పారదర్శకతను పెంపొందించడంలో, నిబంధనల అమలును నిర్ధారించడంలో, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచడంలో కంపెనీ సెక్రటరీల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ దక్షిణ భారత ప్రాంతీయ కంపెనీ సెక్రటరీల సదస్సు--2026ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్షిణ భారత రాష్ట్రాల నుంచి హాజరైన 700 మందికిపైగా కంపెనీ సెక్రటరీలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. కార్పొరేట్ రంగంలో సుస్థిర అభివృద్ధికి, పారదర్శక పాలనకు, పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంపొందించేందుకు కంపెనీ సెక్రటరీలు చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. తెలంగాణ ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం, పెట్టుబడిదారులకు అనుకూలమైన వ్యాపార వాతావరణం కల్పించేందుకు కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించడంతో



పాటు రాష్ట్రానికి మరిన్ని దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న ప్రతినిధులందరికీ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, ఈ సమావేశం విజ్ఞానాన్ని పెంపొందించే, అనుభవాలను పంచుకునే, వృత్తిపరంగా మరింత అభివృద్ధికి దోహదపడే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రకు మణిహారం...



భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ద్వారా ఉత్తరాంధ్ర వికాసంలో ఒక సరికొత్త చరిత్రకు నాంది పలికామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ విమానాశ్రయం ప్రాంతీయ అభివృద్ధికి ఒక మణిహారం లాంటిదని, దీనివల్ల ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలలకు రెక్కలొచ్చాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేసిన స్థానిక రైతులకు సీఎం శిరస్సు వంచి పాదాభివందనం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విమర్శించిన వారు అడ్రస్ లేకుండా పోయారు

సభను ఉద్దేశించి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రెండేళ్ల క్రితం తీవ్రంగా విధ్వంసమైన రాష్ట్రాన్ని చూశాం. ఇప్పుడు రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నాం. ఒకప్పుడు ఎర్రబస్సు కూడా రాదన్న చోటికి ఈరోజు ఎయిర్‌బస్సు వచ్చింది! గతంలో ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అవహేళన చేసిన వారు ఇప్పుడు రాజకీయంలో అడ్రస్ లేకుండా పోయారు. అనేక అడ్డంకులు, సవాళ్లను అధిగమించి ప్రపంచ స్థాయి సదుపాయాలతో ఈ అద్భుత విమానాశ్రయాన్ని నిర్మించుకోవడం ఏపీ ప్రజలందరికీ ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర బిడ్డల భాగస్వామ్యం గర్వకారణం

భోగాపురం విమానాశ్రయం నిర్మాణం వెనుక స్థానిక నాయకులు, పారిశ్రామికవేత్తల పాత్రను సీఎం ప్రత్యేకంగా కొనియాడారు:జీఎంఆర్ గ్రూప్: ఈ విమానాశ్రయాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థ అధినేత ఉత్తరాంధ్ర వాసి కావడం విశేషం. తొలి అడుగు: ఈ విమానాశ్రయ ప్రాజెక్టుకు తొలి అడుగు వేసి పునాది వేసింది అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు. పూర్తి చేసిన బాధ్యత: ఇప్పుడు ఈ ప్రాజెక్టును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యతను సమర్థవంతంగా

## ఆదాయంలో ఆల్-టైమ్ రికార్డు కొట్టిన తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. జులై 2026 నెలలో అత్యధికంగా రూ.7,865 కోట్ల ఆదాయాన్ని సేకరించి, ఇప్పటివరకు ఒక్క నెలలో వచ్చిన గరిష్ఠ ఆదాయంగా కొత్త చరిత్ర నమోదు చేసింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్థిక పురోగతి, మెరుగైన పన్ను నిబంధనల అమలు, శాఖ చేపడుతున్న పటిష్టమైన చర్యల వల్ల ఈ ఘనత సాధ్యమైంది.

సరికొత్త ఆల్-టైమ్ రికార్డు..

గతంలో ఏప్రిల్ 2026లో వచ్చిన 77,598 కోట్ల రాబడియే ఇప్పటివరకు అత్యధికం కాగా, ఈ జులైలో సేకరించిన 77,865 కోట్లతో ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జులై 2025లో వచ్చిన 76,624 కోట్లతో పోలిస్తే, ఈసారి రూ. 1,241 కోట్లు (19% వృద్ధి) అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తం రాబడిలో జీఎస్టీ ఆదాయమే రూ. 4,452 కోట్లుగా ఉంది. గతేడాది జులై (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22% పెరుగదల కనిపిస్తోంది. తెలంగాణలోని పన్ను చెల్లింపుదారుల నుండి వసూలైన మొత్తం జీఎస్టీటీ రాబడి (IGST, CGST, SGST కలిపి) 75,819 కోట్లకు చేరింది. జులై నెల జీఎస్టీ వృద్ధిరేటు (19%) విషయంలో దేశంలోనే హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. అఖిల భారత సగటు వృద్ధిరేటు 10%గా మాత్రమే ఉంది.



## సంపాదకీయం

ఆదివారం 02-08-2026

# భగత్ సింగ్ వారసులకు జేజేలు..!!

నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యార్థి, యువజన ఉద్యమం దేశవ్యాప్తంగా ఎలా ప్రభావం చూపిందో, జంతర్ మంతర్ నిరసనలు, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, సంస్కరణలపై డిమాండ్లు, యువత పోరాటం చుట్టూ సాగిన పరిణామాల విశ్లేషణ..

భగత్ సింగ్ వారసులకు జేజేలు..!!

విద్యార్థి యువజనుల పోరాటం ఫలించింది.. నీట్ పేపర్ లీక్‌పై దేశ రాజధాని జంతర్ మంతర్‌లో ఉద్యమించారు. ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు, బీజేపీ కార్యకర్తలు, చివరి మతోన్మాద శక్తులు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలుగా వేధించిన, పోరాటం చేస్తున్న జెన్ జీలను మానసికంగా, శారీరకంగా హింసించినా వెనక్కి తగ్గలేదు..

పేపర్ లీక్‌పై కేంద్ర ప్రభుత్వ అకౌంటబిలిటీ కోసం పోరాటం చేశారు.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యావ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని, వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని యువత ఢిల్లీ వీధుల్లో ఆందోళనలు చేశారు.. దేశం మాదే పోరాటం మాదే భవిష్యత్తు మాదే అంటూ ఉద్యమ నినాదాలు ఎత్తుకున్నారు. యువత చేస్తున్న ఉద్యమాన్ని కుట్రలు కుతంత్రాలతో యువత ఐక్యతను చీల్చే ప్రయత్నం కేంద్రం చేసింది.. దాదాపు 40 రోజుల తర్వాత కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.

కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ!

నిజానికి ఇది బీజేపీ ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ.. దేశంలో ప్రాంతీయ పార్టీలను తిమింగలంలా మింగేస్తూ, ఎమ్మెల్యేలు, ఎంపీలను కొంటూ ప్రాంతీయ పార్టీలను చీల్చుతూ, ప్రభుత్వాలను పడగొట్టుతూ రాజకీయ అన కొండగా మారిన బీజేపీకి పెద్ద ఎదురు దెబ్బనే. బీజేపీ, కేంద్రానికే కాదు ప్రధాని మోడీ చరిష్మాకు మచ్చే. విశ్వ గురువుగా తన అనుచరుల వర్గంతో కీర్తించబడుతూ తనకు ఇంకా తిరుగేలేదంటూ 2047లోపు తన పాలన పార్టీని సుస్థిరం చేసుకునే లక్ష్యంతో ముందుకు వెళుతున్న కాషాయ పార్టీకి, దాని అనుబంధ సంస్థలకు యువత షాక్ కలిగించింది.

కుంభస్థలాన్ని ఢీకొట్టిన జెన్ జీ..

మరోవైపు ఇది ప్రజా , విద్యార్థి యువజనుల మరో విజయం. ఇది ఖచ్చితంగా దేశ యువత గెలుపు.. జెన్ జీ గెలుపు.. వాళ్ళకు అండగా నిలబడ్డ దేశం గెలుపు.. ఈ గెలుపులో ప్రతి ఒక్కరూ విజేతలే. జెన్ జీ లు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని మరోసారి యువత రుజువు చేసింది.. ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీ అని, తాము తిరుగు లేని శక్తి, తమకు దేశంలో ఎదురులేదు అని విర్రవీగిన వాళ్ళకు జెన్‌జీ లు, కాక్రోచ్‌లు చారిత్రాత్మక సమాధానం చెప్పారు..

నిరుపమాన త్యాగమూర్తులు యువతులే..

నీట్ పేపర్ లీక్ వ్యతిరేక ఉద్యమంలో మహిళలు, యువతులదే ప్రధాన పాత్ర.. ఎంతో ఓర్పుతో, సహనంతో, ప్రభుత్వం, పోలీసులు, మతోన్మాదులు ఎన్ని రకాలుగా వేధించినా రాణి రుద్రమలా, సమ్మక్క సారలమ్మలా, ఒక పూలన్ దేవిలా పోరాటం చేశారు.. ధిక్కార స్వరంతో గర్జించారు. వాళ్లే ఉద్యమాన్ని కోట్లాది మంది ప్రజలకు దగ్గర చేశారు. జనాలు జెన్ జీ ఉద్యమంలో పాల్గొనేలా చేశారు. మరీ ముఖ్యంగా జంతర్ మంతర్ వద్ద పోలీసుల నుంచి తమ సహచర విద్యార్థులను యువతులు కాపాడుకున్నారు.. తల్లి తన బిడ్డలను కాపాడుకున్నట్లు కాపాడు కున్నారు.. ఒక్క జంతర్ మంతర్ లోనే కాదు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇదే సీన్ కనిపించింది.

ప్రపంచాన్నే ఆకర్షించిన ఆ ఫొటో..

పోలీసులు లాఠీలతో ఒళ్ళు హూనమయ్యేలా కొట్టుతుంటే, శరీరం నుంచి రక్తం చిందుతుంటే భయ పడకుండా ఎంత కొట్టుతారో కొట్టండి.. చంపినా పోరాటం ఆపేది లేదు, దేశం కోసం మా భవిష్యత్ కోసం ఫ్యూచర్ తరాల కోసం ఎన్ని దెబ్బలైనా తింటం.. ఎన్నిసార్లు అయిన మరణిస్తాం.. మళ్ళీ మళ్ళీ సూర్యుడిలా ఉదయిస్తాం అంటూ నిలబడ్డారు.. అంతేకాదు మహారాష్ట్రలో ఒక యువతి ఎంతో ధైర్యంగా ఉద్యమకారులను అరెస్ట్ చేసి తీసుకుపోతున్న పోలీసులు వాహనాన్ని ఒక్కతే అడ్డుకుంది. ప్రాణాలకు తెగించి పోలీసులు వాహనంపై చేయి పెట్టి ఆపడం మొత్తం దేశం దృష్టినే కాదు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆ ఒక్క ఫోటో, ఆ యువతి ధైర్యం సాహస మీడియో జెన్ జీ లు ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకుపోయింది. మొత్తం దేశాన్ని కదిలించింది.. అప్పటి వరకు న్యూట్రల్‌గా ఉన్న వాళ్ళు కూడా యువత పోరాటానికి మద్దతుగా నిలబడ్డారు.

వాళ్లే నిజమైన దేశ ప్రేమికులు..

మతోన్మాదులు, కుహనా దేశభక్తిపరులు యువతను ఎన్ని పేర్లతో వేధిస్తే అంత ఉత్తేజం అయ్యింది. అక్కడ పోరాటాలు చేసింది దేశ భక్తులు.. ప్రజాస్వామ్య ప్రేమికులు, రాజ్యాంగ పరిరక్షకులు, భావి భారత పౌరులు, దేశ భవిష్యత్తు నిర్మాతలు.. అందుకే మీరు ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని కేసులు పెట్టిన ఎంత హింసించినా ఎన్ని రకాల పేరు పెట్టినా ఓపికతో ఓర్చుకున్నారు.. మీ మానసిక శారీరక వేధింపులు భరించారు.. వాళ్ళు అసలైన దేశ భక్తులు.. దేశ ప్రేమికులు..కుల మతాలను గౌరవించే జెన్‌జీ లు.. మీ దోపిడీ కుట్రలు బద్దలు కొట్టే యువ కిశోరాలు.. కొనసాగాలి యువత ఐక్యత.. కొనసాగాలి యువ కార్మిక కర్షక సంఘటిత శక్తి.. కొనసాగాలి ప్రజా పోరాటాలు..!!

# పెన్షన్ కోసం ఎందుకీ టెన్షన్?




హైదరాబాద్,రిటైరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు త్వరితగతిన న్యాయం చేయాల్సిన కనీస ధర్మం, నైతిక బాధ్యత అధికారులపైనే ఉంది. పెన్షనరీ బెనిఫిట్స్ సకాలంలో రిటైర్డ్ ఉద్యోగికి అందాలంటే పెన్షన్ మంజూరు అధికారులు నాన్చుడు ధోరణికి వెంటనే స్వస్తి పలకాలి. రిటైరయ్యే రోజే పెన్షన్ మంజూరు పత్రాలు ఉద్యోగి చేతికి అందాలని ప్రభుత్వం జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను అమలు చేయాలి. ఉద్యోగి రిటైర్ అవడానికి ఆరు నెలల ముందే పెన్షన్ పేపర్లను ప్రిపేర్ చేసి ఎజి ఆఫీస్‌కు పంపించవల్సిన పూర్తి బాధ్యత మంజూరు అధికారులదే. ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.దశాబ్దాలపాటు ప్రభుత్వ సేవలోనే గడిపి, విశ్రాంతి తీసుకునే వయసులో వచ్చే పెన్షన్ మంజూరు కోసం రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు వారాలు, నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి రావడం అత్యంత విచారకరం! ముప్పై నలభై ఏళ్లపాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ భుజాలపై మోసి, వ్యవస్థల పురోగతికి రక్తాన్ని చెమటగా మార్చిన విశ్రాంత ఉద్యోగులకు.. గౌరవంగా, సకాలంలో దక్కాల్సిన పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి రావడం వ్యవస్థకే అవమానకరం! కలం చేత పట్టి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులు, ఫైళ్ల మోతతో ప్రభుత్వ పాలనను నడిపించిన ఉద్యోగులు.. రిటైర్ అయ్యాక తమ హక్కుల కోసం, చేతులు కట్టుకుని అధికారుల ముందు యాచకులుగా నిలబడాలా? జీవిత చరమాంకంలో ప్రశాంతంగా గడపాల్సిన వయసులో, ప్రభుత్వ నిబంధనలపై అవగాహన లేని కొందరు జిల్లా స్థాయి అధికారుల నిర్లక్ష్యపు ఫైళ్ల కింద వారి ఆత్మగౌరవం నలిగిపోతుండడం అత్యంత దారుణమైన విషయం.తెలంగాణ రివైజ్డ్ పెన్షన్ రూల్స్- 1980లో క్వాలిఫైయింగ్ సర్వీస్ లెక్కించడానికి నిర్దేశించిన రూల్- 21 పై కనీస అవగాహన లేని కొందరు పెన్షన్ మంజూరు అధికారుల వైఖరి వల్ల రిటైర్ అవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారుల నాన్చుడు వైఖరితో సకాలంలో పెన్షన్ అందక ఎందరో రిటైర్డ్ సిబ్బంది మానసిక క్షోభకు గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఉద్యోగ కాలంలో లీవ్ శాలరీ పొందిన సెలవు దినాలన్నీ పెన్షన్‌కు క్వాలిఫైయింగ్ సర్వీస్ గానే పరిగణించబడతాయి. మెడికల్ గ్రౌండ్స్‌పై తీసుకున్న జీతనష్టపు అసాధారణ సెలవు పీరియడ్ మొత్తాన్ని కూడా పెన్షన్ క్వాలిఫైయింగ్ సర్వీస్‌గా పరిగణించాలని తెలంగాణ రివైజ్డ్ పెన్షన్ రూల్ -21(1) నిర్దేశిస్తోంది. వైద్య కారణాలతో తీసుకున్న ఎక్స్‌ట్రార్డినరీ లీవ్ (ఇఒఎల్) కాకుండా, ఇతర కారణాలతో తీసుకున్న అసాధారణ జీత నష్టం సెలవు (ఇఒఎల్) సైతం గరిష్టంగా 36 నెలల వరకు పెన్షన్ అర్హత సర్వీస్‌గా లెక్కించాలని రూల్- 21(2) స్పష్టం చేస్తోంది.ఇంత చిన్న విషయం కూడా తెలియని వారు జిల్లా స్థాయి అధికారులుగా ఉండడం ఉద్యోగ, ఉపాధ్యాయుల దురదృష్టకరం. అలాగే పౌర అల్లర్ల కారణంగా విధుల్లో చేరలేకపోయినా లేదా హయ్యర్ సైంటిఫిక్, టెక్నికల్ విద్య కోసం వెళ్లినప్పుడు నియామక అధికారి అనుమతితో ఆ కాలాన్ని కూడా పెన్షన్‌కు క్వాలిఫైయింగ్ సర్వీస్‌గా లెక్కించవచ్చు. జీవో 214 ప్రకారం.. ముందస్తు అనుమతితో విదేశాల్లో ఉద్యోగం చేయడానికి వెళ్లే వారికి గరిష్టంగా ఐదు సంవత్సరాల వరకు ఇఒఎల్ మంజూరు చేస్తారు. ఈ ఐదేళ్ల ఇఒఎల్ కాలాన్ని సర్వీస్ బ్రేక్‌గా పరిగణించకూడదు. ఈ సెలవును ఒకేసారి లేదా విడతల వారీగా వాడుకోవచ్చు. అయితే, ఈ సెలవును విదేశాల్లో ఉద్యోగం చేయడానికే ఉపయోగించాలి తప్ప, అక్కడ ఉద్యోగం వెతుక్కోవడానికి ఉపయోగించకూడదు. పెన్షన్ కాంట్రిబ్యూషన్ చెల్లిస్తే ఈ ఐదేళ్ల పీరియడ్‌ని సైతం నిబంధనల ప్రకారం పెన్షన్ కోసం క్వాలిఫైయింగ్ సర్వీస్‌గానే తీసుకోవాలి.ఇంతటి స్పష్టమైన నిబంధనలు చట్టంలో కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు జిల్లా స్థాయి అధికారులు మాత్రం గుడ్డిగా వ్యవహరిస్తూ పెన్షన్ ఫైళ్లను తిరస్కరించడం లేదా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి కాలయాపన చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. అధికార దర్పంతో ఫైళ్లను మూలనపడేసే అధికారులు.. కాల చక్రం తిరుగుతుందని, రేపు తాము కూడా పెన్షన్ కోసం ఇలాగే క్యూలైన్లలో నిలబడాల్సిన రోజొకటి వస్తుందనే కఠిన వాస్తవాన్ని ఎలా విస్మరిస్తారు? ఇప్పటికైనా పెన్షన్ మంజూరు అధికారులు ప్రభుత్వ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి. రిటైరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు త్వరితగతిన న్యాయం చేయాల్సిన కనీస ధర్మం, నైతిక బాధ్యత అధికారులపైనే ఉంది.పెన్షనరీ బెనిఫిట్స్ సకాలంలో రిటైర్డ్ ఉద్యోగికి అందాలంటే పెన్షన్ మంజూరు అధికారులు నాన్చుడు ధోరణికి వెంటనే స్వస్తి పలకాలి. రిటైరయ్యే రోజే పెన్షన్ మంజూరు పత్రాలు ఉద్యోగి చేతికి అందాలని ప్రభుత్వం జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వులను అమలు చేయాలి. ఉద్యోగి రిటైర్ అవడానికి ఆరు నెలల ముందే పెన్షన్ పేపర్లను ప్రిపేర్ చేసి ఎజి ఆఫీస్‌కు పంపించవల్సిన పూర్తి బాధ్యత మంజూరు అధికారులదే. ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం ఈ విషయంలో నిక్కచ్చిగా ఉండి కఠినంగా వ్యవహరిస్తేనే క్షేత్రస్థాయిలో చలనం వస్తుంది, రిటైర్ అయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయం జరుగుతుంది. సకాలంలో పెన్షన్ మంజూరు అవుతుంది. లేని పక్షంలో, పెన్షన్ మంజూరు ప్రక్రియ అధికారుల ఇష్టారాజ్యంగా, అవినీతికి అడ్డాగా మారే ప్రమాదం ఉంది.

# భోగాపురంపై క్రెడిట్ వార్...

విజయనగరం, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రెడిట్ వార్ నడుస్తోంది. ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భోగాపురం క్రెడిట్ తమకే దక్కుతందని మాజీ సీఎం జగన్ అంటే.. కూటమికే క్రెడిట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు అంటున్నారు. ఈ ఇద్దరిలో భోగాపురం క్రెడిట్ ఎవరిది?..విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో ఉత్తరాంధ్రలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కుతుందనే అంశం తెరపైకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాలని జగన్ అంటుంటే.. కూటమి ప్రభుత్వానికే క్రెడిట్ దక్కుతుందని అధికార పార్టీలు అంటున్నాయి. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చోరీ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. తాను ఏమీ చేయకపోయినా కీర్తి తనకే దక్కాలంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పనులు ఓ కొలిక్కి తీసుకొచ్చామన్నారు.అయితే అసలు ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది తామేనని చంద్రబాబు అంటున్నారు. కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చి భూసేకరణ ప్రారంభించి శంకుస్థాపన చేశామన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 31 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. ఈ ఇద్దరి వాదనలు పక్కన పెడితే.. అసలు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బీజం ఎప్పుడు పడింది?.. 2016లో ప్రతిపాదనల దగ్గర నుంచి 2026 ప్రారంభోత్సవం వరకు ఏ ప్రభుత్వ హయాంలో ఏ పనులు జరిగాయో తెలుసుకుందాం..

2014 నుంచి 2019 వరకు ఏం జరిగింది?

రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో కీలకంగా మారింది. సాగరతీర నగరం పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. అక్కడ ఉన్న విమానాశ్రయం రక్షణ శాఖ ఆధీనంలో ఉంది. ఈ విషయాన్ని గమనించి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.. ఉత్తరాంధ్రలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భావించింది. 2016లో మరో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కొత్తగా ప్లాన్ చేస్తున్న ఎయిర్‌పోర్ట్ విశాఖపట్నానికి సమీపంలో ఉంటే బావుంటుందని భావించారు.. అందుకే భోగాపురంలో నిర్మించాలని ప్రతిపాదించగా కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అదే ఏడాది కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి టెక్నికల్, సైట్ అనుమతులు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు 15,000 ఎకరాల భూమిని సేకరించాలని భావించారు.. కానీ 2,700 ఎకరాలకు తగ్గించి భూసేకరణ ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు చేతులు మీదుగా ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేశారు. 2019 ఏప్రిల్ నెలలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది.

2019-2024 మధ్య ఏం జరిగింది?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణకు సంబంధించి అంశాలపై ఫోకస్ పెట్టింది. కోర్టు వివాదాలు, కేసుల్ని పరిష్కరించింది.. ఇందుకోసం భూసేకరణను 2200 ఎకరాలకు కుదించింది. భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి పునరావాసం కల్పించారు. అనంతరం భోగాపురం విమానాశ్రయం పనులకు సంబంధించి జీఎంఆర్ సంస్థతో కన్సెషన్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన ఎన్వోసీలు సహా మిగిలిన అనుమతుల్ని పొందారు. 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన (రెండోసారి) చేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వేగంగా చేరుకునేలా 77 మీటర్ల




వెడల్పుతో, రూ. 6,300 కోట్ల ఖర్చుతో 55 కి.మీ. మేర ఆరు లేన్ల హైవేను కేంద్రం ప్రకటించింది. 2023 నవంబర్‌లో రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

2024-2026 హయాంలో ఏ పనులు చేశారు?

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయం పనులపై ఫోకస్ పెట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రి కావడంతో పనుల్లో వేగం పెరిగింది. ఏటీసీ టవర్, అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ వర్క్స్, సాంకేతిక పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వయంగా అక్కడ పనుల్ని పరిశీలించారు. 2024లో రన్‌వే, ట్యాక్సీవేలు, అప్రాన్ పనులు, టెర్మినల్ బిల్డింగ్ పనులు వేగవంతం చేశారు. ఎయిర్‌పోర్ట్‌లోని ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్గో కాంప్లెక్స్, ఐరన్ స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. 2024లో ఈ విమానాశ్రయానికి కూటమి ప్రభుత్వం మన్యం వీరుడు 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా పేరుపెట్టింది. అలాగే ఎయిర్‌పోర్టుకు జాతీయ రహదారి నుంచి అనుసంధానించే అప్రోచ్ రోడ్ల పనులు మొదలుపెట్టారు.2025లో టెర్మినల్ లోపల బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, సెక్యూరిటీ స్కానింగ్, ఆటోమేటెడ్ వ్యవస్థలకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అలాగే ఏటీసీ టవర్ నిర్మాణం ముగిసింది.. అక్కడ అవసరమైన రాడార్, కమ్యూనికేషన్ సిగ్నల్ పరికరాలను అమర్చారు. 2025లో మొదటిసారి తేలికపాటి విమానం సాయంతో ట్రయల్ రన్ పూర్తిచేసి.. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు అవసరమైన రోడ్ల పనులు కూడా చేపట్టారు. 2026 జనవరి 4న భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై తొలి వ్యాలిడేషన్ ఫ్లైట్ (ట్రయల్ రన్) విమానం ల్యాండ్ అయ్యింది. అంతేకాదు ఆఉఅం (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి అవసరమైన ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు సేఫ్టీ, ఫైర్, పర్యావరణ అనుమతులు వచ్చాయి. అలాగే ఎయిర్‌పోర్ట్ లోపల ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా ఇంటీరియర్ ఆర్ట్ వర్క్స్ పనులు పూర్తి చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేషనల్ హైవేను కలిపే ముఖ్యమైన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం క్రెడిట్ ఎవరిది అనే చర్చను పక్కన పెడితే.. అటు వైఎస్సార్‌సీపీ, ఇటు కూటమి ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్‌లో కీలకపాత్ర పోషించాయి. 2016లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఎయిర్‌పోర్ట్‌కు బీజం పడింది. ప్రాజెక్ట్ ఆలోచన, ప్రతిపాదనతోపాటు కేంద్రం అనుమతులు సాధించింది చంద్రబాబు హయాంలోనే. అలాగే పనులను వేగవంతం చేసి, ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది కూడా కూటమి ప్రభుత్వం హయాంలోనే. అయితే జగన్ హయాంలో భూ వివాదాలు, కోర్టు కేసులను పరిష్కరించారు. జీఎంఆర్‌తో ఒప్పందం చేసుకొని భూమిని అప్పగించారు. రన్ వే నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ లాంటి పనులు వైసీపీ హయాంలోనే మొదలయ్యాయి. విజన్, పనులను వేగవంతంగా పూర్తి చేసిన విషయంలో క్రెడిట్ టీడీపీది కాగా.. భూసమస్యల పరిష్కారం, కన్సెషన్ ఒప్పందం విషయంలో క్రెడిట్ వైఎస్సార్‌సీపీకి ఇవ్వొచ్చు. అంటే భోగాపురం క్రెడిట్ ఈ రెండు పార్టీలదీ.

# కీ రోల్ లో తమ్మినేని వాణి

శ్రీకాకుళం,మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుటుంబం చుట్టూ ప్రస్తుతం చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపి, నకిలీ డెత్ సర్టిఫికెట్లు, ఫోర్జరీ వారసత్వ పత్రాలు సృష్టించి రూ.4 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నిన కేసులో తమ్మినేని కుటుంబం ఇరుక్కుపోయింది. ఈ కేసులో హైకోర్టు నుంచి తమ్మినేని సీతారాం, ఆయన భార్య తమ్మినేని వాణిలకు తాత్కాలిక ముందస్తు బెయిల్ లభించినప్పటికీ, కుమారుడు చిరంజీవి నాగ్‌కు మాత్రం బెయిల్ నిరాకరించడంతో సీతారాం తీవ్ర ఇరకాటంలో పడ్డారు. దీనికి తోడు, అమదాలవలస పరిధిలోని యాఖీ కాలేజీ వెనుక ఉన్న దళిత కుటుంబం భూమిని ఆక్రమించారంటూ వాణిపై తాజాగా మరొక ఫిర్యాదు పోలీసులకు అందిందిఆముదాలవలస నియోజకవర్గ పరిధిలో తమ్మినేని సీతారాం కేవలం పేరుకే ప్రజాప్రతినిధిగా, స్పీకర్‌గా ఉండేవారని, అసలు డాన్ పాత్ర పోషించింది మాత్రం ఆయన భార్య తమ్మినేని వాణినే అనే టాక్ బలంగా ఉంది. సీతారాం సంపాదించిన రాజకీయ పదవులు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని వెనుకుండి సెటిల్మెంట్లు, భూ లావాదేవీలు, రాకెట్లు నడిపించడంలో ఆమె ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఆరోపణలు వస్తున్నాయి. కొడుకు చిరంజీవి నాగ్ కూడా పూర్తిగా తల్లి ఆదేశాల మేరకే పనిచేస్తూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణల్లో పాత్రదారులుగా మారారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆముదాలవలసలో జరిగిన పలు అక్రమాలు, దందాలు, భూ ఆక్రమణల వెనుక వాణి ముద్రలు ఉన్నాయనే అంశం ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తన గుప్పిట్లో ఉంచుకుని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకునే స్థాయికి ఈ దందాలు సాగాయని స్థానిక బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లను సాక్షులుగా పెట్టి, నకిలీ వారసులను సృష్టించి కోట్లాది రూపాయల ఆస్తులను తమ ఖాతాలో వేసుకున్నారనే నిజాలు దర్యాప్తులో వెలుగుచూడటం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. సీతారాం స్పీకర్ హోదాలో ఉండటంతో బాధితులు ఎవరూ బయటకు వచ్చి మాట్లాడటానికి ధైర్యం చేయలేకపోయేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడం, పోలీసు దర్యాప్తు పారదర్శకంగా సాగుతుండటంతో వాణి సృష్టించిన అక్రమాల చిట్టా అంతా బయటపడుతోంది. ప్రజాప్రతినిధిగా ఉన్న భర్త పవర్‌ను దుర్వినియోగం చేస్తూ ఆముదాలవలసను ఏలిన ఈ షాడో లీడర్ నిజస్వరూపం బయటపడటంతో, తమ్మినేని కుటుంబానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది.

# తిరుమల తరహాలో కర్నూలు దర్శనాలు

కర్నూలు ,ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భక్తుల దర్శనాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీశైల దేవస్థానంలో ప్రోటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులందరితో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ మార్పులను ఖరారు చేశారు.ఈ కీలక సమావేశంలో 45 అంశాలపై సమగ్రంగా చర్చించి?. అందులో 39 కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు. సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తొలగించి, మరింత సులభంగా దర్శనం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు.నూతన రూల్స్ ప్రకారం? ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై ఇచ్చే ప్రోటోకాల్ టికెట్లను వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారానే జారీ చేస్తారు.ఈ ప్రోటోకాల్ దర్శనం కోరుకునే వారు దర్శన సమయానికి కనీసం 48 గంటల ముందే తమ సిఫార్సు లేఖలను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.ఈ మార్పు ద్వారా భక్తుల రద్దీని సులభంగా నియంత్రించడంతో పాటు, దర్శన వేళల్లో మరింత పారదర్శకత వస్తుందని పాలకమండలి భావిస్తోంది.ప్రముఖుల సిఫార్సు లేఖల పేరిట జరిగే అక్రమాలను అరికట్టడంతో పాటు, సాధారణ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వేగంగా దర్శనం పొందేందుకు ఈ చర్యలు ఎంతగానో తోడ్పడతాయని ఆలయ ఛైర్మన్ పేర్కొన్నారు.ఇక శ్రీశైలం క్షేత్రాభివృద్ధిలో భాగంగా భక్తుల వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. నూతన క్యూ కాంప్లెక్స్, ఏ-గ్రేడ్ శౌచాలయాలు, స్నానపు గదుల నిర్మాణం, తిరుమల తరహాలో పీఏసీ (పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటును ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల రాకపోకల సౌకర్యార్థం హిందూమాల సత్రం నుంచి కుమార సదనం వరకు?. యోగివేమారెడ్డి సత్రం వెనుక భాగంలో రూ. 24 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించనున్నారు.రాబోయే శ్రావణ మాసంలో భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన గోపురాలకు రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేయనున్నారు. భక్తుల విశ్రాంతి కోసం నందీశ్వర మరియు నీలకంఠేశ్వర డార్మెటరీలలో డక్టబుల్ ఎయిర్ కూలర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అలాగే క్యూ కాంప్లెక్సులో అదనపు వాటరు కూలర్లను అమర్చనున్నారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి?. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి దేశం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ ఆగమశాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘటాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, హోమాలు, జపాలు మరియు పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయి.

# హద్దు మీరుతున్న మందుబాబుల వీరంగం..

సి.బెళగల్, మండల పరిధిలోని కొండాపురం గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గుర్తుతెలియని ఆకతాయిలు సృష్టించిన విధ్వంసం గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. గురువారం రాత్రి కొందరు మందుబాబులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి తరగతి గదుల తాళాలు పగులగొట్టి లోపల ఉన్న సామగ్రితో పాటు సీలింగ్ ఫ్యాన్లను ధ్వంసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు తరగతి గదుల పరిస్థితిని చూసిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ ఘటనతో విద్యార్థుల చదువులకు అంతరాయం ఏర్పడటంతో పాటు పాఠశాల ఆస్తులకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.స్థానికుల కథనం ప్రకారం, రాత్రి వేళల్లో కొందరు మందుబాబులు తరచూ పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులపై దాడులు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) ఆదం భాషకు సమాచారం అందించినట్లు తెలిపారు. పాఠశాల భద్రతను బలోపేతం చేయడంతో పాటు ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలకు కేవలం పది అడుగుల దూరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండటమే ఇలాంటి ఘటనలకు ప్రధాన

# కాక్రోచ్ సౌండ్ కంటిన్యూ...ప్లాన్ బి కోసం ?

న్యూఢిల్లీ,కాక్రోచ్ జనతా పార్టీ అని పేరు పెట్టి ఉద్యమించారు. సోషల్ మీడియా నుంచి నేరుగా గ్రౌండ్ లోకి వచ్చి పడ్డారు. జంతర్ మంతర్ వద్ద రాజకీయ పోరాటానికి దిగారు. కేంద్ర పాలకులను కూడా దిగి వచ్చేలా చేశారు. చివరికి అనుకున్నది సాధించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా అన్నది జరిగిపోయింది. విద్యార్థుల డిమాండ్లు అయితే నెరవేరాయి. దాంతో కాక్రోచ్ ఆందోళన కూడా ముగిసింది. కానీ కాక్రోచ్ అయితే ఇంకా సౌండ్ చేస్తూనే ఉంది. మరి ఆ సౌండ్ వెనక వ్యూహం ఏంటో అన్నది మాత్రం అర్థం కావడం లేదని అంటున్నారు.

బూతులు మాట్లాడితే కేసులా :

బూతులు మాట్లాడితే కేసులు పెడతారా అంటూ కాక్రోచ్ పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే ప్రశ్నిస్తున్నారు. కేవలం బూతులు మాట్లాడినంత మాత్రాన వెంటనే క్రిమినల్ కేసులు, ఎఫ్ఐఆర్‌లు పెట్టడం సరికాదని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. ఎవరైనా బూతులు మాట్లాడితే నేరుగా క్రిమినల్ ప్రొసీడింగ్స్ లేదా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం కంటే తొలి దశలో కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టం అందరికీ సమానం అని ఆయన హితవు చెబుతున్నారు. కేవలం సోషల్ మీడియాలో లేదా నిరసనలలో బూతులు మాట్లాడారనే కారణంతో కొందరిపై మాత్రమే ఎఫ్ఐఆర్‌లు వేయడాన్ని తప్పుబట్టారు. రాజకీయ పార్టీలకతీతంగా బీజేపీ ఐటీ సెల్ సహా అందరిపై ఇలాంటి నిబంధనలను ఒకేలా అమలు చేయాలని అభిజిత్ దీప్కే డిమాండ్ చేశారు. దీంతో ఆయన తన పోరాటానికి కామా మాత్రమే పెట్టారు తప్ప ఫుల్ స్టాప్ పెట్టలేదని అంటున్నారు.

మోడీ ఆవేదన :

విద్యార్థుల బూతుల మీద ప్రధాని నరేంద్ర మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళనలలో తనపైన మాత్రమే కాదు దివంగతురాలు అయిన తన తల్లిపై సైతం దూషణలకు పాల్పడటం పట్ల నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. బూతులు దూషణలు ఏ సమస్యను పరిష్కరించలేవని పేర్కొంటూనే తప్పుదారి పట్టిన ఆ యువతను క్షమిస్తున్నట్లు ఆయన తెలిపారు. జంతర్ మంతర్ నిరసనల్లో కొందరు నాగరిక



సమాజం హర్షించని రీతిలో తనను తన తల్లిని దూషించారని ప్రధాని మోదీ సోషల్ మీడియా వీడియోలో తాజాగా ఎత్తి చూపడం విశేషం. ఇలాంటి బూతుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అయితే మార్పు రావాలని కోరుకునే యువతను శిక్షించడం కంటే సరైన మార్గంలో పెట్టాలని పిలుపునిచ్చారు. పేపర్ లీక్ కేసులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

అజెండా కోసమేనా :

అయితే దాదాపుగా మీడియాతో ప్రతీ రోజూ సీజేపీ ఫౌండర్ అభిజిత్ దీప్కే అందుబాటులో ఉంటున్నారు. ఆయన ఒక రోజు బీజేపీలో తనను చేరమంటున్నారు అని కామెంట్స్ చేసి సంచలనం రేపారు. తాజాగా విద్యార్థుల బూతుల విషయంలో కేసులు పెడితే బీజేపీ నేతల మీద పెట్టాలంటూ రివర్స్ ఎటాక్ చేశారు. ఇంకో వైపు చూస్తే విద్యార్థులను కేసుల పేరుతో వేధిస్తే తాను మళ్ళీ ఉద్యమిస్తాను అని కూడా భారీ స్టేట్మెంట్ ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే సరైన అజెండా కోసం సీజేపీ ఫౌండర్ చూస్తున్నారా అన్న చర్చ సాగుతోంది. ఏదో రూపంలో తొందరలోనే ఆయన మళ్ళీ జనంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. ఎందుచేతనంటే అభిజిత్ దీప్కే తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీమానా కోరుతూ డిమాండ్ చేశారు. ఇవన్నీ రాజకీయ స్వరాలే అని అంటున్నారు. చూడాలి మరి కాక్రోచ్ ఎపుడు రీసౌండ్ చేస్తుంది అన్నది.

# తెలంగాణ బీజేపీకి క్లాస్... రీల్స్ మీమ్స్ అంటూ !



హైదరాబాద్,తెలంగాణా బీజేపీ నేతలకు అధినాయకత్వం మరోసారి దిశా నిర్దేశం చేసినట్లుగా తెలుస్తోంది. పార్టీకి తెలంగాణాలో మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. అయితే అవకాశాలను చేజార్చుకుంటున్నారు అని మండిపడుతోంది బీజేపీ హైకమాండ్. పార్టీ తరఫున చేయాల్సినవి చేయడం లేదని జనాలకు ఎలా కనెక్ట్ అవుతామని కూడా క్లాస్ ని గట్టిగా తీసుకుంటోంది అంటున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర స్థాయిలో కాక్రోచ్ దెబ్బ తిన్న బీజేపీకి మరో వైపు అదే కాక్రోచ్ మేలు కొలుపు పలికింది అని అంటున్నారు. అందుకే సోషల్ మీడియా వాడకం పెరగాలని ఈ మధ్యనే ప్రధాని నరేంద్ర మోడీ కేబినెట్ సహచరులకు సూచించారు. ఇప్పుడు బీజేపీ కేంద్ర పెద్దలు ఇదే విషయం మీద సూచనలు చేస్తున్నారు.

అక్కడే వెనుకబడ్డారు :

ఈ రోజున సోషల్ మీడియా ప్రభావం ఎంతో ఎక్కువగా ఉందని అయితే దానిని సరిగ్గా వాడుకోవడంలో మాత్రం తెలంగాణా బీజేపీ నేతలు పూర్తిగా వెనకబడి ఉన్నారని బీజేపీ పెద్దలు స్పష్టం చేశారు అని అంటున్నారు. అసలు ఎందుకు సోషల్ మీడియాను పక్కన పెడుతున్నారని కూడా గట్టిగా అడిగారని అంటున్నారు. ప్రస్తుతం అంతా డిజిటల్ యుగం నడుస్తోందని కూడా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాతో ఆన్ లైన్ తో కనెక్షన్ లేకపోతే పార్టీ ఎలా ఎదుగుతుందని కూడా ప్రశ్నిస్తున్నారని అంటున్నారు.

రీల్స్ మీమ్స్ అంటూ :

ఇక మీదట తెలంగాణా బీజేపీ నేతలు అంతా రీల్స్ చేయాల్సిందే అని కూడా ఆదేశాలు జారీ చేశారని భోగట్టా. అంతే కాదు మీమ్స్ వంటివి చేయడం ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నం చేయాలని కూడా సూచించారని అంటున్నరు. ప్రతీ ఒక్క నేత ఇక మీదట దీనిని ఒక సవాల్ గా స్వీకరించాలని కోరారని అంటున్నారు. అంతే కాదు ఎవరికి వారుగా ఎక్కువ మంది ఫాలోవర్స్ ని పెంచుకోవాలని కోరారని అంటున్నారు.

సర్కార్ ని నిలదీయాలి :

తెలంగాణా ప్రభుత్వాన్ని ఆన్ లైన్ లో సోషల్ మీడియాలో ఎక్కువగా నిలదీస్తే మంచి ఫలితాలు ఉంటాయని కూడా కేంద్ర బీజేపీ నాయకత్వం చెబుతోంది అంటున్నారు. అది కూడా ఆషామాషీగా కాకుండా ఇరుకున పెట్టేలా వ్యూహాత్మకంగా ఉండాలని కోరింది. ఈ రోజున డిజిటల్ ప్రచారం అన్నది ఎంతో కీలకం అని చెబుతోంది. ఆ విధంగా సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా ఎవరైతే ప్రజలకు చేరువ అవుతారో వారే పొలిటికల్ గా హిట్ అవుతున్నారని కూడా పేర్కొంది.

జోరు పెరుగుతుందా :

కేంద్ర నాయకత్వం ఆదేశాలతో తెలంగాణా బీజేపీ నేతలలో జోరు పెరుదుతుందా అన్న చర్చ సాగుతోంది. ఇంతకాలం వారు రొటీన్ రాజకీయమే చేశారు అని అంటున్నారు. కానీ కేంద్ర పెద్దల ఆదేశాలతో చాలా మంది సోషల్ మీడియా వైపు ఫోకస్ పెంచారని అంటున్నారు. ఎవరికి వారుగా ఇపుడు ఖాతాలను హ్యాండిల్ చేసేలా సిబ్బందిని ఎక్కడికక్కడ ప్రత్యేకంగా నియమించుకున్నారని కూడా చెబుతున్నారు. అటు కాంగ్రెస్ ని మరో వైపు బీఆర్ ఎస్ ని కూడా గట్టిగా సోషల్ మీడియా ద్వారా బీజేపీ విమర్శించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు అని అంటున్నారు. మరి ఇది ఎంతవరకూ ప్రభావం చూపిస్తుంది అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా తెలంగాణా కమలానికి డిజిటల్ హంగులు అద్దితే 2028లో అధికారం సొంతం అవుతుందా లేదా అంటే ఆ జోరు పెరగాలి, జనాలకు కనెక్ట్ కావాలి అపుడు చూడాల్సిందే అన్న మాట వినవస్తోంది.

# ఓట్ల వేటు.. తెలంగాణలో 40 లక్షల ఓట్లు మాయం?



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతోంది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, అందులో దాదాపు 40 లక్షల ఓట్లను మళ్లీ తిరిగి పొందేందుకు వీలు లేని 'అన్?కలెక్టబుల్' కేటగిరీ కింద పరిగణించి తొలగించేందుకు ఈసీ అధికారులు సమాయత్తమవుతున్నారు.సర్వే పూర్తయిన ప్రాంతాల్లో ఓటర్లకు 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు అందించామని అధికారులు చెబుతున్నప్పటికీ, అందులో పెద్ద సంఖ్యలో ఫారాలు సేకరించడం సాధ్యపడలేదనే నెపంతో వాటిని అన్?కలెక్టబుల్ జాబితాలో పొందుపరిచారు.రెండు వారాల్లోనే ఆకాశాన్నంటిన 'ఏఎస్డీ' గణాంకాలు : ఎలక్షన్ కమిషన్ ఈసీఐ డ్యాష్‌బోర్డ్‌లో వెల్లడైన లెక్కలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయి.

రెండు వారాల క్రితం: – గైర్హాజరు,– నివాసం మారినవారు,– మరణించినవారు) కేటగిరీ కింద అన్‌కలెక్టబుల్ ఓట్లు 13 లక్షలు. ప్రస్తుతం రెండు వారాల వ్యవధిలోనే ఈ సంఖ్య ఏకంగా 40 లక్షలకు చేరింది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 2,59,50,506 ఓటర్ల (76.72%) పత్రాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే డిజిటలైజేషన్‌కు ఆగస్టు 3 వరకు గడువు నిర్దేశించినప్పటికీ, గడువు ముగియక ముందే లక్షలాది ఓట్లను 'అన్?కలెక్టబుల్'గా ఖరారు చేయడంపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశాయి.

ఏ నియోజకవర్గంలో ఎంత శాతం కోత? : నగర, పట్టణ ప్రాంతాల్లో ఈ ఓట్ల కోత 'కత్తిమీద సాము'లా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, పరిసర నియోజకవర్గాల్లో పదుల సంఖ్యలో శాతం ఓట్లు రద్దయ్యే ప్రమాదంలో పడ్డాయి.

| నియోజకవర్గం | అన్‌కలెక్టబుల్ ఓట్ల శాతం |
|---|---|
| ఉప్పల్ | 28% |
| పశ్చిమ వరంగల్ | 26% |
| సికింద్రాబాద్ | 24% |
| మంచిర్యాల | 23% |
| సికింద్రాబాద్ కంటోన్మెంట్ | 22% |
| కుత్బుల్లాపూర్ | 21% |
| కరీంనగర్ | 20% |

మిగిలిన అనేక నియోజకవర్గాల్లో కూడా 10% నుంచి 20% వరకు ఓట్లు ఈ ఏఎస్డీ జాబితాలోకి చేరడం గమనార్హం.

క్షేత్రస్థాయి ఉల్లంఘనలు – 'బీఎల్ఏ'లపై తీవ్ర ఒత్తిడి : కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనల ప్రకారం... ఏఎస్డీ కేటగిరీ కింద ఒక ఓటరు పేరును తొలగించాలంటే సంబంధిత పోలింగ్ బూత్ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులైన పోలింగ్ ఏజెంట్ల (BLA -- Booth Level Agents) సమక్షంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వారి సంతకాలు సేకరించాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. అందని ఎన్యూమరేషన్ ఫారాలు: 100 శాతం పంపిణీ చేశామని అధికారులు చెప్తున్నా, వేలాది మంది ఓటర్లకు ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందనేలేదు. పంపిణీ చేయని ఫారాలను కూడా 'అన్ కలెక్టబుల్' జాబితాలోకి నెట్టేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'అన్ కలెక్టబుల్' వర్గంపై పూర్తి అవగాహన లేని బీఎల్ఏల నుంచి, ఓటర్లు నివాసం ఉండటం లేదని ధ్రువీకరించేందుకు అధికారులు బలవంతంగా సంతకాలు చేయిస్తున్నట్లు సమాచారం.

# రేవంత్ కు గ్రేటర్ కలవరం...

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదు. అధికారంలో ఉన్నారన్న మాటే కానీ గ్రేటర్ ఎన్నికలపై కొంత ఆందోళన కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. అనేక అంశాలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ కు ఒక్క శాసనసభ నియోజకవర్గంలోనూ గెలవలేదు. తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో మాత్రం గెలిచి హైదరాబాద్ లో కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం లభించినట్లయింది. అయితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు మాత్రం అంత సులువు కాదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ నగర అభివృద్ధి కంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టిందన్న విమర్శలున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వేగంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, కానీ కాంగ్రెస్ హయాంలో కొంత హైదరాబాద్ లో అభివృద్ధి వెనకబడి ఉందని అంటున్నారు. రియల్ ఎస్టేట్ కూడా పెద్దగా ముందుకు పోవడం లేదు. అనేక ఇళ్లు కొనుగోలు చేయకుండా మూలన పడి ఉన్నాయి. ఇదే సమయంలో రహదారులు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు మ్యాన్ హోల్స్ లో పడి మృతులు కూడా ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నారు. అలాగే మంచినీటి సరఫరా కూడా వేసవిలో సక్రమంగా అందకపోవడంతో నగరవాసులు ఒకింత అసంతృప్తితో ఉన్నారంటున్నారు మరొకవైపు హైడ్రా అంశం కూడా కీలకంగా మారింది. హైడ్రా అధికారులు ఆక్రమణలు కూల్చివేయడంతో అనేక మంది తమ నివాసాలను కోల్పోయారు.



హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, అన్యాయంగా కూల్చివేస్తుందని ఆరోపిస్తున్నారు. మరొకవైపు మూసీ రిజర్వాయర్ ప్రక్షాళన పనులు ప్రారంభిస్తామని చెప్పడం, సర్వేలు చేయడం వంటివి కూడా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటం, కాంగ్రెస్ ఏ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల లో అత్యధిక స్థానాలను సాధిస్తుందన్న ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. బీజేపీ హిందుత్వ నినాదంతో వెళుతుండటం, మజ్లిస్ పార్టీతో కాంగ్రెస్ సన్నిహిత్వంపై ప్రశ్నిస్తుండటం కూడా కాంగ్రెస్ ను కొంత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు కలవరానికి గురి చేస్తున్నాయని చెప్పక తప్పదు.

# గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి

హైదరాబాద్:ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ఢ పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రిగారు శుక్రవారం సాయింత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకరతో టెలిఫోన్‌లో మాట్లాడి, గోదావరి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతున్న దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వాములుగా చేయాలని సూచించారు.ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక,

# రీజినల్ రింగ్ రోడ్ - హైదరాబాద్ చుట్టూ రియల్ ఎస్టేట్ ధమాకా



హైదరాబాద్,హైదరాబాద్ మహానగరం నలువైపులా శరవేగంగా విస్తరిస్తుండటంతో స్థిరాస్థి రంగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఔటర్ రింగ్ రోడ్ ను దాటి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ దిశగా నగరం అడుగులు వేస్తుండటంతో, ఓఆర్ఆర్ , ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న శాటిలైట్ ప్రాంతాలు ప్రాపర్టీ పెట్టుబడులకు హాట్‌స్పాట్‌లుగా మారుతున్నాయి. ముఖ్యంగా షాద్‌నగర్, భువనగిరి, సంగారెడ్డితో పాటు తూర్పు హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్, ఉప్పల్–వరంగల్ నేషనల్ హైవే కారిడార్ల పరిసరాల్లో నూతన రియల్ ఎస్టేట్ వెంచర్లు, HMDA, DTCP ఆమోదం పొందిన ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఒక్కసారిగా పుంజుకుంది.భవిష్యత్తు రవాణా అవసరాలను తీర్చేందుకు ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మాణం కానుండటం, పారిశ్రామిక ప్రాజెక్టుల విస్తరణ, డిజిటల్, డేటా సెంటర్ల రాక వంటి కీలక అంశాలు ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన చోదక శక్తులుగా నిలుస్తున్నాయి. వ్యాపారవేత్తలు, మధ్యతరగతి ఉద్యోగులు తక్కువ ధరలోనే లభించే ఓపెన్ ప్లాట్లలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఓఆర్ఆర్ దాటి కొన్ని నిమిషాల ప్రయాణ వ్యవధిలోనే ప్రధాన నగరానికి చేరుకునేలా మెరుగైన ఫోర్–లేన్, సిక్స్–లేన్ రహదారుల అనుసంధానం ఏర్పడటం వీరికి అదనపు ప్రయోజనంగా మారింది.దక్షిణాన షాద్‌నగర్–జడ్చర్ల బెల్ట్ బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో పాటు సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌ల కారణంగా ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పశ్చిమాన సంగారెడ్డి–ముంబై జాతీయ రహదారి పరిసరాలు కంది, ఐఐటీ హైదరాబాద్, పారిశ్రామిక జోన్లతో అనుసంధానమై ఉండటంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే తూర్పున భువనగిరి–ఘట్‌కేసర్ కారిడార్ ఎమ్స్ , మెట్రో విస్తరణ వార్తలతో మధ్యతరగతి గృహ కొనుగోలుదారులకు ప్రధాన కేంద్రంగా మారింది.మహానగరం అంచుల్లో కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణాలు కూడా వేగవంతమవుతున్నాయి. దీంతో రాబోయే 5 నుండి 10 ఏళ్ల కాలంలో ఆర్ఆర్ఆర్ సరిహద్దుల ప్రాంతాలు హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో కీలకమైన ఆర్థిక, నివాస హబ్‌లుగా రూపాంతరం చెందుతాయని, ముందస్తుగా ఇక్కడ చేసే పెట్టుబడులు ఆస్తిపరులకు మంచి రాబడులను అందిస్తాయని అంచనా వేస్తున్నారు.

## తెలంగాణ ప్రజలకు అందుబాటులో ఫ్యామిలీ సర్టిఫికెట్

హైదరాబాద్,ప్రజా సౌకర్యమే లక్ష్యంగా మన ఇందిరమ్మ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను ఏ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థకైనా లేదా వ్యవస్థకైనా సులభంగా, అధికారికంగా అందించేందుకు వీలుగా 'ఫ్యామిలీ సర్టిఫికెట్' ను అందుబాటులోకి తీసుకొచ్చాం. జలు తమ పరిధిలోని మీ–సేవ (ఓవమావలజీ) కేంద్రాలు లేదా తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లి సులభంగా ఈ సర్టిఫికెట్ ను పొందవచ్చని అయన అన్నారు.రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ తదితర పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాల సమాచారంతో కూడిన ఈ ఫ్యామిలీ సర్టిఫికెట్ రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అయన అన్నారు.

# ఇరాన్ ఉలిక్కిపడేలా.. ట్రంప్, నెతన్యాహు మెగా ఆపరేషన్!

టెహ్రాన్:మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ భారీ స్థాయి వైమానిక దాడులకు సిద్ధమవుతున్నాయా? అంటే తాజా పరిణామాలు అవుననే సంకేతాలు ఇస్తున్నాయి. ఇరాన్ ఇంధన మౌలిక వసతులపై ఇప్పటివరకు జరగని స్థాయిలో దాడుల ప్రణాళిక సిద్ధమవుతున్నట్లు అమెరికా అధికారులను ఉటంకిస్తూ సీబీఎస్ న్యూస్ వెల్లడించింది.ఈ దాడుల్లో ఇరాన్‌లోని కీలక విద్యుత్ కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారాలు వంటి వ్యూహాత్మక లక్ష్యాలను ఎంచుకున్నట్లు సమాచారం. ఇరాన్ సైనిక కార్యకలాపాలు, ప్రభుత్వ వ్యవస్థను కొనసాగించే సామర్థ్యాన్ని బలహీనపర్చడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ ఉండొచ్చని అమెరికా అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ భారీ ఆపరేషన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా తుది అనుమతి ఇవ్వలేదని సమాచారం. పెంటగాన్ కూడా లక్ష్యాలపై స్పందించేందుకు నిరాకరించింది.ప్రపంచ మార్కెట్లు సోమవారం ప్రారంభమయ్యేలోపు ఈ ఆపరేషన్‌ను ముగించాలని అమెరికా వర్గాల్లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇరాన్ ఇంధన సరఫరాలపై దాడులు జరిగితే ప్రపంచ చమురు మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఈ అంశంపై జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌ను కూడా ఈ ప్రణాళికల్లో భాగస్వామిగా ఉంచినట్లు తెలుస్తోంది. వాషింగ్టన్‌తో టెల్ అవీవ్ సన్నిహిత సమన్వయం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇరాన్‌పై పూర్తి స్థాయి సైనిక చర్యకు తిరిగి వెళ్లే నిర్ణయం ఇంకా తీసుకోలేదని ఓ ఇజ్రాయెల్ అధికారి స్పష్టం చేశారు.ట్రంప్ అధ్యక్షతన క్యాంప్ డేవిడ్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో ఇరాన్‌పై సైనిక ఎంపికలపై చర్చ జరిగినట్లు సమాచారం. కొందరు అధికారులు ఈ చర్యకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ, ట్రంప్




మాత్రం ఇరాన్‌పై కఠిన వైఖరిని ప్రదర్శిస్తూ చాలా తీవ్రంగా దెబ్బతీస్తాం అనే సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అమెరికా లక్ష్యం ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాన్ని అడ్డుకోవడమేనని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. అధ్యక్షుడి నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా అమలు చేసేందుకు అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని పెంటగాన్ పేర్కొంది. టెహ్రాన్ నగర విద్యుత్ సరఫరాను దెబ్బతీయడం వంటి ప్రత్యామ్నాయాలపైనా అమెరికా అధికారులు చర్చించినట్లు సమాచారం.మరోవైపు అమెరికా, ఇజ్రాయెల్ చర్యలపై ఇరాన్ తీవ్ర హెచ్చరికలు చేసింది. ఎలాంటి అమెరికా దాడి జరిగినా ప్రతీకార చర్యలకు సమగ్ర ప్రణాళిక సిద్ధంగా ఉందని ఇరాన్ భద్రతా వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్‌లోని కీలక మౌలిక వసతులు, ప్రాంతీయంగా ఉన్న అమెరికా ఇంధన వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం తమకు ఉందని హెచ్చరించాయి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140